సాక్షి మంచిర్యాల

బుధవారం, 3, మే, 2023



అంతా 'ఓపెన్'

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో వసూళ్లకు తెరలేపారు. అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించేలా కాపీయింగ్‌కు పాల్పడుతున్నారు.

10లో▸

పట్టపగలే కన్నం వేశారు



జిల్లాలో మంగళవారం పట్టపగలే దొంగలు రెచ్చిపోయారు. అపార్టుమెంట్లలో తాళం వేసి ఉన్న ఇళ్లకు కన్నం వేశారు. బంగారం, వెండి ఆభరణాలు అపహరించారు.

8లో▸

గరిష్టం/కనిష్టం
33.6 /24.4

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. గాలిలో తేమశాతం ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత చాలాచోట్ల వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

డీఈవోగా యాదయ్య



యాదయ్య

మంచిర్యాల అర్బన్: మంచిర్యాల డీఈవోగా యాదయ్య నియమితులయ్యారు. ప్రస్తుతం పనిచేస్తున్న వెంకటేశ్వర్లును సంగారెడ్డి జిల్లాకు బదిలీ చేశారు. మహబూబ్‌నగర్ డీఈవో యాదయ్య మంచిర్యాలకు రానున్నారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. వెంకటేశ్వర్లు 2019, అక్టోబర్ 4న జిల్లా విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. మూడున్నరేళ్లు పనిచేశారు. సమయ పాలన పాటించని ఉపాధ్యాయులపై కొరడా ఝుళిపించారు. కరోనా సమయంలో ఆన్‌లైన్ తరగతుల నిర్వహణ, బదిలీ, పదోన్నతుల ప్రక్రియలో తనదైన ముద్ర వేసుకున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించకుంటే పోరాడుతాం



దీక్షలో పాల్గొన్న వినోద్‌నాయక్

జన్నారం: జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగ భద్రత కల్పించి, రెగ్యులర్ చేయకుంటే జేపీఎస్‌ల పక్షాన పోరాటం చేస్తామని ఏబీసీ రీసెర్చ్ డిపార్టుమెంట్ తెలంగాణ కోఆర్డినేటర్ వినోద్‌నాయక్ హెచ్చరించారు. జన్నారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు మద్దతుగా శిబిరంలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించని సీఎం తెలంగాణ జాతిపిత ఎలా అవుతారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలోనే ఉద్యోగులకు, నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభదాస్, ప్రధాన కార్యదర్శి ఫసీఉల్లా, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యం రాజన్న, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇందయ్య, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రమేశ్, నరేశ్, ఇమ్రాన్, హేమంత్ చారి, రమేశ్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శుల యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎజాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్ పరీక్ష వాయిదా

మంచిర్యాలఅర్బన్/బెల్లంపల్లి: ఓపెన్ ఇంటర్ పరీక్ష మంగళవారం రద్దు చేశారు. తెలుగు మీడియంకు బదులు ఇంగ్లిష్ మీడియం ఎకనామిక్స్ ప్రశ్నపత్రం పంపించారు. ఉదయం 9 గంటల కు అభ్యర్థులంతా పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. బెల్లంపల్లి, మంచిర్యాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లోకి వెళ్లిన అభ్యర్థులకు తెలుగు బదులు ఇంగ్లిష్ మీడియం ప్రశ్నాపత్రం రావటంతో అధికారులు అభ్యర్థులను బయటకు పంపారు. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఇంటర్ ఎకనామిక్స్ పరీక్ష వాయిదా వేస్తున్నట్లు మంచిర్యాల డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. తిరిగి 13న పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

128 మంది గైర్హాజర్

పదోతరగతి, ఇంటర్ ఓపెన్ పరీక్షలకు 128 మంది గైర్హాజరయ్యారు. పదో తరగతిలో 638 మందికి 568 మంది హాజరుకాగా 70 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్‌లో 550 మందికి 492 మంది హాజరుకాగా 58 మంది గైర్హాజరైనట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

బ్యాడ్మింటన్ శిక్షణ ప్రారంభం



బ్యాడ్మింటన్ శిక్షణకు హాజరైన చిన్నారులు

మంచిర్యాలటౌన్: జిల్లా యువజన క్రీడల శాఖ, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా శాఖ సమన్వయంతో జిల్లా కేంద్రంలోని రంగంపేటలోని మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో సోమవారం ఉచిత బ్యాడ్మింటన్ శిక్షణను జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో అందించే ఉచిత బ్యాడ్మింటన్ శిక్షణను చిన్నారులు సద్వినియోగం చేసుకుని, క్రీడల్లో తగిన నైపుణ్యం పొందాలన్నారు. అనంతరం చిన్నారులను పరిచయం చేసుకుని బ్యాడ్మింటన్ శిక్షణను ప్రారంభించారు. జూన్ 2వ తేదీ వరకు నిర్వహించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి పుల్లూరి సుధాకర్, కోశాధికారి సత్యపాల్‌రెడ్డి, మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీ యజమాని మధు, సీనియర్ క్రీడాకారుడు కృష్ణ, కోచ్‌లు నాగేంద్ర, పళ్లెం రాజలింగులు పాల్గొన్నారు.

కౌలుకోలేని దెబ్బ!

రాలిన మామిడి కాయలు ఏరుతున్న ఈ రైతుపేరు శ్రీరాముల దేవేందర్. నెన్నెల మండలం గంగారం గ్రామానికి చెందిన ఈయన పదెకరాల మామిడి తోటను రూ.4 లక్షలకు కౌలుకు తీసుకున్నాడు. ఈ ఏడాది పూత, పిందె బాగుండడంతో రూ.60 వేలు పెట్టుబడి పెట్టాడు. దిగుబడి కూడా ఆశాజనకంగా వచ్చింది. కాయలు తెంపేందుకు సిద్ధమవుతున్న తరుణంలో గత నెలలో మూడుసార్లు కురిసిన వడగండ్ల వానకు కాయలు నేల రాలాయి. ఆ కాయలను మార్కెట్‌కు తరలిస్తే దళారులు చెప్పిన ధరకే అమ్ముకున్నాడు. రూ.5 లక్షల వరకు ఆదాయం వస్తుందనుకుంటే.. రూ.2 లక్షల వరకు నష్టం జరిగింది. దీంతో యజమానికి రూ.4 లక్షలు చెల్లించగా, మరో రూ.2 లక్షల వరకు అప్పు మిగిలింది. దీంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతు ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నాడు. ఇది ఒక్క దేవేందర్ పరిస్థితే కాదు.. జిల్లాలోని కౌలురైతులందరిదీ ఇదే పరిస్థితి.



- కౌలు రైతుకు కలిసిరాని కాలం..
- వరి, మిర్చి, మొక్కజొన్న, మామిడి సాగు
- నిండా ముంచిన అకాల వర్షాలు
- పెట్టుబడి మీదపడుతుందని ఆవేదన

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ ఏడాది అకాల వర్షాలు కౌలు రైతును కోలుకోలేని దెబ్బతీశాయి. వానా కాలంలో అతివృష్టితో పంటలు కోల్పోయారు. యాసంగిలో నష్టాన్ని పూడ్చుకుని నాలుగు పైసలు మిగుల్చుకోవచ్చనే ఆశతో పంటలు వేసిన రైతులను వడగండ్ల వానలు నిండా ముంచాయి. ప్రకృతి కరుణించి, గిట్టుబాటు ధర లభిస్తుందనే ఆశతో జిల్లాలో కౌలు రైతులు ఏటా వరి పొలాలు, చేలు, మామిడి తోటలు కౌలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది వానాకాలం అతివృష్టితో వరి, పత్తి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. యాసంగి అయినా కలిసి వస్తుందనుకుంటే వరి పొలాలను ఆదిలోనే తెగుళ్లు ఆశించాయి. అన్నీ ఎదుర్కొని పంట చేతికి వస్తుందనుకుంటున్న సమయంలో అకాల వర్షాలు నిండా ముంచాయి. కోయని పొలాల్లో వడ్లు రాలిపోగా, కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యం కొట్టుకుపోయింది. తడిసి మొలకెత్తుతోంది.

ముందే కౌలు చెల్లింపు..

గతంలో యజమానులు కౌలు రైతులపై నమ్మకంతో భూములు ఇచ్చేవారు. రెండు పంటలు పండిన తర్వాత కౌలు డబ్బులు తీసుకునేవారు. కానీ రెండేళ్లుగా మారుతున్న వాతావరణంతో కౌలు ముందే వసూలు చేస్తున్నారు. లాభ నష్టాలతో సంబంధం లేకుండా కౌలు చెల్లించాలని కండీషన్ పెడుతున్నారు. వ్యవసాయం తప్ప మరో పని తెలియని కౌలు రైతులు చేసేదేమీ లేక అప్పులు చేసి కౌలు చెల్లించి భూములు సాగుచేస్తున్నారు. మరోవైపు పంటల పెట్టుబడికి అప్పులు చేసి సాగు చేసి కంటికి రెప్పలా కాపాడుతున్నాడు. దిగుబడి చేతికి వచ్చిన సమయంలో అకాల వర్షాలు దెబ్బతీస్తున్నాయి. కోత దశలో ఉన్న వరి నెలవాలి ధాన్యం రాలిపోగా.. కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం కొట్టుకుపోయింది. మొక్కజొన్న పంట నేలవాలి దెబ్బతిన్నాయి. మామిడి కాయలు నేలరాలి నష్టం మిగిల్చాయి.



నేలవాలిన వరి పంట

పట్టాదారుకే పట్టం.. కౌలు రైతుకు కష్టం..

జిల్లాలో గత నెలలో కురిసిన అకాల వర్షాలకు వరి, మొక్కజొన్న, మామిడి, మిర్చి పంటలు వేల ఎకరాల్లో నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఎకరాకు రూ.పది వేల ఇవ్వాలని నిర్ణయించింది. అధికారులు సర్వే చేసి 4,786 మంది రైతులకు చెందిన 6,538 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, మామిడి పంటకు నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పరిహారం సాగుచేసిన కౌలు రైతులకు కాకుండా, భూముల యజమానుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈమేరకు భూమి పట్టా పాస్‌పుస్తకం, విస్తీర్ణం, బ్యాంకు అకౌంట్, మొబైల్ తదితర వివరాలు తీసుకున్నారు. దీంతో పరిహారం యజమానుల ఖాతాల్లో జమకానున్నాయి. రైతుబంధు, కిసాన్ సమ్మాన్ నిధి డబ్బులు కూడా రైతుల ఖాతాల్లోనే జమయ్యాయి. కౌలు రైతుకు మిగిలింది నష్టమే.

పెట్టుబడి కూడా రాని పరిస్థితి..

జిల్లాలో ఈ యాసంగి 1.04 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. అధికంగా 94.240 ఎకరాల్లో వరి సాగైంది. ఇందులో 40 శాతం 13,500 మంది కౌలు రైతులు సాగుచేశారు. వీరు వరి, మొక్కజొన్న, మిర్చి సాగుచేశారు. నేల స్వభావం, నీటి సౌకర్యాన్ని బట్టి ఎకరా వరి పొలానికి రూ.15 నుంచి రూ.20 వేలు చెల్లించి కౌలుకు తీసుకున్నారు. సాగుకు మరో రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టారు. కానీ ఈ ఏడాది అకాల వర్షాలతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎకరానికి 40 బస్తాల వరకు రావాల్సిన ధాన్యం 20 బస్తాలకు పడిపోయింది. ఇక మిర్చి సాగుచేసిన రైతులు ఎకరానికి రూ. 25 వేల చొప్పున కౌలు చెల్లించి భూమి తీసుకొని రూ.1.40 లక్షల వరకు పెట్టుబడి పెడితే దిగుబడి వచ్చిన పంట కల్లాల్లో ఆరబోసుకుని ధర కోసం ఎదురు చూస్తున్న సమయంలో ఈదురుగాలు వర్షాలు ముంచేశాయి. డిసెంబర్‌లో పూత, పిందను చూసి కొంతమంది మామిడి తోటలు లీజుకు తీసుకున్నారు. మామిడి తోట పూత, కాత నుంచి బట్టి ఎకరానికి రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకు పెట్టుబడి పెట్టారు. పూత పిందె చూసి మురిసిపోయిన రైతులు గత నెల నుంచి వర్షాలు చెట్టుమీద కాయనిలవకుండా చేశాయి. దీంతో పెట్టుబడి కూడా చేతికి వచ్చే పరిస్థితి లేకుండా పోయింది.

నిండా ముంచిన వానలు..



ఎకరానికి రూ.20 చొప్పున చెల్లించి 9 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగుచేశాను. వానకాలం భారీ వర్షాలు ముంచినయ్. యాసంగైనా కలిసి వస్తుందనుకుంటే మొదట్లో మొగిపురుగు, పీక పురుగు వ్యాప్తితో మూడుసార్లు మందులు కొట్టిన. అయినా 20 శాతం పంట దెబ్బతిన్నది. ఇప్పుడు అకాల వర్షాలు దెబ్బతీస్తున్నయ్. ఇటీవల నాలుగు ఎకరాలు కోసి ధాన్యం కల్లంలో పోసిన. 20 బస్తాల వడ్లు వర్షానికి కొట్టుకుపోయినయ్.

– ముత్తే నగేశ్, గుడిపేట్

మిర్చి కొట్టుకుపోయింది



ఎకరం చేనుకు రూ.25 వేలకు కౌలుకు తీసుకున్నా. మిర్చి పంట సాగుచేస్తే తెగుళ్లు సోకి పంట 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పెట్టుబడి రూ.1.50 లక్షలు ఖర్చయింది. మార్కెట్లో దిగుబడి లేదని కల్లంలో ఆరబోసుకుంటే ఈదురు గాలులు, వర్షానికి కొట్టుకుపోయింది. రూ.50 వేల వరకు లాస్ అయింది. పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు.

– దుర్గం శ్యామ్, ఎదులబంధం, కోటపల్లి

మహిళల కోసం ఆరోగ్య కేంద్రాలు



కంటివెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

మంచిర్యాలటౌన్/బెల్లంపల్లిరూరల్: మహిళల ఆరోగ్యం, సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరోగ్య మహిళా కేంద్రాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్, డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు సూచించారు. జిల్లా కేంద్రంలోని హమాలీవాడ బస్తీ దవాఖానాలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా కేంద్రాన్ని కలెక్టర్, బెల్లంపల్లి మండలం తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని శిబిరాన్ని డీఎంహెచ్‌వో మంగళవారం తనిఖీ చేశారు. ఉదయం 9 గంటల నుంచే పరీక్షలు ప్రారంభించాలని సూచించారు. ప్రతీ కేంద్రంలో 60 నుంచి 70 మంది మహిళలను పరీక్షించాలని సూచించారు. జిల్లాలోని 4 కేంద్రాలలో 247 మందికి వైద్య పరీక్షలను నిర్వహించగా, 13 మంది మూత్రనాళ, 49 మంది సూక్ష్మపోషక, 57 మందికి థైరాయిడ్ ప్రొఫైల్, 44 మంది విటమిన్ డి, 54 మందికి సీబీపీ పరీక్షలు చేసినట్లు వివరించారు. మహిళలు వైద్య సేవలను సద్వినియోగించుకునేలా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమాల్లో ప్రోగ్రాం అధికారి డాక్టర్ నీరజ, వైద్యులు వైష్ణవి, స్వరూప, వందన, డీఎస్‌వో ఫయాజ్‌ఖాన్, తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఎవంజలీన్, అనీష్, సీహెచ్‌వో ప్రభాకర్, హెచ్‌ఈవో సమ్మయ్య పాల్గొన్నారు.

చాకేపల్లి సబ్ సెంటర్ పరిశీలన:

మండలంలోని తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల చాకేపల్లి హెల్త్ సబ్ సెంటర్ ను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అనీష్ తనిఖీ చేశారు. గ్రామస్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.వైద్య సిబ్బంది ఉమాదేవి, సీహెచ్‌వో ప్రభాకర్ ఉన్నారు.

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోండి

మంచిర్యాలటౌన్/బెల్లంపల్లి: జిల్లా కేంద్రంలోని ఎంసీసీ అంబేద్కర్ కాలనీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని కలెక్టర్ బదావత్ సంతోష్ సందర్శించారు. ప్రజలు కంటి పరీక్షలను చేసుకుని శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి 14 వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని ఎమ్మెల్యే చిన్నయ్యతో కలిసి డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం కంటి రుగ్మతలు లేకుండా చేసేందుకు కంటి వెలుగు శిబిరాలు నిర్వహిస్తోందని చిన్నయ్య తెలిపారు. కంటి వెలుగు ప్రోగ్రాం జిల్లా అధికారి డాక్టర్ ఫయాజ్ , అర్బన్ హెల్త్‌సెంటర్ మెడికల్ అధికారి సౌజన్య, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

భీమిని: వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు సూచించారు. భీమిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడి రికార్డులను పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని సూచించారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యుడు కృష్ణ ఉన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

- కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బంది పెట్టకుండా ధాన్యం కొనుగోళ్లు జరపాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్లు మధుసూదన్ నాయక్, రాహుల్, ట్రైనీ కలెక్టర్ గౌతమి, పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్, జెడ్పీసీఈవో నరేందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, డీపీవో వెంకటేశ్వర్‌రావుతో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో మిల్లర్లు, ట్రాన్స్‌పోర్టు ప్రతినిధులు, ఎంపీడీవోలతో వేర్వేరుగా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ ఏర్పాటు చేయాలని తెలిపారు. ధాన్యం విక్రయించిన రైతులకు సంబంధిత రశీదు ఇవ్వాలన్నారు. రైతు, ధాన్యం కొనుగోలు వివరాలను ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు ట్యాగింగ్ చేసిన మిల్లులకు పంపించేలా చర్యలు తీసుకోవాలని వివరించారు.

ఉపాధి పనులు వేగవంతం చేయాలి

మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. కూలీలకు 100 రోజుల పని కల్పించాలని తెలిపారు. మరుగుదొడ్ల నిర్మాణ పనులను ఈ నెల 20లోగా పూర్తి చేయాలని సూచించారు.

విద్యుత్ పొదుపుగా వాడాలి..

విద్యుత్‌ను పొదుపుగా వినియోగించి భవిష్యత్ తరాలకు నాణ్యమైన విద్యుత్ అందించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. కలెక్టర్ చాంబర్‌లో విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ శేషారావుతో కలిసి విద్యుత్ భద్రత– పొదుపు సంబంధిత వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.నాణ్యమైన ఐఎస్‌ఐ మార్కుల స్టార్‌రేటెడ్ విద్యుత్ పరికరాలను వాడాలని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డీఈ ఎం ఎం.ఖైసర్, ఏడీలు ఆర్.స్వామి, రాజశేఖర్, తిరుపతి, రవికుమార్ ఏడీఈ బాలకృష్ణ పాల్గొన్నారు.

పోడుకు పట్టం



భీమారం మండలం రెడ్డిపల్లిలో పోడుభూములపై సభ(ఫైల్)

పోడు దరఖాస్తుల వివరాలు..

జిల్లా	గిరిజనుల దరఖాస్తులు	విస్తీర్ణం (ఎకరాల్లో)	గిరిజనేతరుల దరఖాస్తులు	విస్తీర్ణం (ఎకరాల్లో)
ఆదిలాబాద్	11,172	44,120	7,712	28,472
మంచిర్యాల	4,460	13,587	7,314	19,830
నిర్మల్	5,076	14,955	3,590	10,037
కుమురంభీం ఆసిఫాబాద్	13,177	51,859	13,503	44,267
మొత్తం	33,885	1,24,521	32,119	1,02,606

- ఫైల్‌పై సీఎం సంతకం
- ఈ నెల నుంచే పంపిణీ
- ఇప్పటికే హక్కుపత్రాలు సిద్ధం
- ఎంపికైన లబ్ధిదారుల్లో హర్షం

సాక్షి,ఆదిలాబాద్: పోడు పట్టాల పంపిణీ కార్యరూపం దాల్చేదిశగా అడుగులు పడ్డాయి. కొత్త సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ ఈ ఫైల్‌పై సంతకం చేశారు. ఈ నెల నుంచే రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేపడతామని చెప్పారు. ఈ మేరకు ఎంపికైన లబ్ధిదారుల్లో హర్షం వ్యక్తమవుతుంది. అటవీ హక్కు పత్రాలు వస్తే తమకు ప్రయోజనం చేకూరుతుందని ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న గిరిజనులతో పాటు గిరిజనేతరులు కూడా భావిస్తున్నారు. దీంతో ఈ ప్రక్రియపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మరోవైపు ఇప్పటికే హక్కు పత్రాలు సిద్ధమైనట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ నిర్ణయం వెలువడిన వెంటనే పంపిణీ చేయనున్నట్లు స్పష్టం చేస్తున్నారు. ఈ విషయమై ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డిని వివరణ కోసం 'సాక్షి' ఫోన్‌లో యత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. ఆదిలాబాద్ జిల్లా అటవీ అధికారి రాజశేఖర్‌ను వివరణ కోరగా.. పూర్తిగా గిరిజన సంక్షేమ శాఖనే పరిశీలన చేస్తుందని, తమ పరిధిలో వివరాలు ఉండవని పేర్కొన్నారు.

ఇదీ పరిస్థితి..

గతేడాది ఆర్‌వోఎఫ్‌ఆర్ టైటిల్ డీడ్స్ కోసం ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. గ్రామ స్థాయిలో వీటిని స్వీకరించింది. అప్పట్లోనే ప్రక్రియ పూర్తి చేస్తామని సర్కారు ప్రకటించింది. క్షేత్రస్థాయి పరిశీలనకు ఆదేశించింది. అటవీ శాఖ నుంచి బీట్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు ఆ దరఖాస్తుదారుల్లో అర్హులు, అనర్హులపై పరిశీలన చేశారు. అనంతరం కార్యదర్శులు ఆన్‌లైన్ యాప్‌లో వాటి వివరాలు నమోదు చేశారు. గ్రామసభలు నిర్వహించి అర్హుల విషయంలోనూ ఆరా తీశారు. ఆ తర్వాత ఆర్డీవో స్థాయిలో సబ్ డివిజనల్ కమిటీ పరిశీలనకు ఆ దరఖాస్తులను పంపారు. ఆ ప్రక్రియ జరుగుతున్న క్రమంలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అటవీ అధికారి శ్రీనివాస్‌రావు హత్య ఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. ఇక పంపిణీ ప్రక్రియ ప్రారంభిస్తారనుకున్న దశలో మళ్లీ నిలిచిపోయింది. అయితే జిల్లాలో అప్పటికే సబ్ డివిజనల్ కమిటీ పరిశీలనతో పాటు జిల్లా స్థాయి కమిటీకి నివేదించడం సైతం పూర్తయింది. అన్ని స్థాయిల్లో పరిశీలన పూర్తయిన నేపథ్యంలో ఇక జిల్లా స్థాయిలో ఆమోదం నామమాత్రమే. ఆపై రాష్ట్రస్థాయి కమిటీ ఆమోదించి పంపిణీ ప్రక్రియను ప్రారంభిస్తారు.

గిరిజనులు, గిరిజనేతరులకు కూడా..

పోడు వ్యవసాయం చేసుకుంటున్న వారిలో గిరిజనులకు సంబంధించి 2005 డిసెంబర్ 13కు ముందు నుంచి సాగులో ఉండి దానిపైనే జీవనాధారంగా ఉంటే వారికి హక్కు పత్రాలు కల్పించనున్నారు. అలాగే గిరిజనేతరులకు సంబంధించి మూడు తరాలకు ముందు నుంచి ఈ లెక్కన సుమారు 75 ఏళ్ల నుంచి ఆ భూమిపై సాగులో ఉంటే వారికి హక్కు పత్రం కల్పించే నిబంధనలున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో నివాసం ఉండే గిరిజనులు, గిరిజనేతరులను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం ఆర్‌వోఎఫ్‌ఆర్ చట్టాన్ని తీసుకొచ్చింది. గిరిజన సంక్షేమ శాఖ దీనికి నోడల్ శాఖగా ఉంటుంది. ప్రధానంగా ఏజెన్సీలో నివాసం ఉండే గిరిజనులు, గిరిజనేతరుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ చట్టాన్ని అమలు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

2006 నుంచి ఆర్‌వోఎఫ్‌ఆర్ చట్టం అమలులోకి వచ్చింది. 2008లో ప్రారంభమైంది. 2019 వరకు ఆర్‌వోఎఫ్‌ఆర్ టైటిల్ డీడ్స్ ఇవ్వడం జరిగింది. ఆ తర్వాత నిలిపివేశారు. అప్పటివరకు 56,358 మంది 2,25,569 ఎకరాల విస్తీర్ణంలో ఉమ్మడి జిల్లాలో అటవీ హక్కు పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 37,372 మందికి చెందిన దరఖాస్తులు 1,35,997 ఎకరాల విస్తీర్ణంలోని భూమికి సంబంధించి అర్హులని గుర్తించారు. 36,713 మందికి 1,37,734 ఎకరాల విస్తీర్ణంలో పట్టాలు పంపిణీ చేశారు. మరో 515 దరఖాస్తులకు సంబంధించి 1,399 ఎకరాల విస్తీర్ణంలో పట్టాల పంపిణీకి సంబంధించి పెండింగ్‌లో ఉంది. ఇదంతా 2019కు ముందు. ఇక ఆ తర్వాత అటవీ హక్కు పత్రాల కోసం పోరాటాలు కొనసాగిన నేపథ్యంలో ప్రభుత్వం మరోసారి సర్వేకు ఆదేశించి దరఖాస్తులు స్వీకరించింది. ప్రస్తుతం ఈ దరఖాస్తులకు సంబంధించి టైటిల్ డీడ్స్ ఎంత మందికి ఇస్తారనేది త్వరలోనే స్పష్టం కానుంది.

లబ్ధిదారులు డీడీలు చెల్లించాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా పశువైద్యాధికారి రమేశ్‌కుమార్

చెన్నూర్‌రూరల్: రెండవ విడత గొర్రెల పంపిణీకి ఎంపిక చేసిన లబ్ధిదారులు తమ వాటా సొమ్ము డీడీలు తీయాలని జిల్లా పశువైద్యాధికారి వై.రమేశ్‌కుమార్ సూచించారు. చెన్నూర్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. రెండో విడత లబ్ధిదారులకు పథకం మార్గదర్శకాలను వివరించారు. లబ్ధిదారులు ధ్రువీకరణ పత్రాలను సంబంధిత పశువైద్యాధికారులకు అందించాలన్నారు. జిల్లా లబ్ధిదారులు గొర్రెలు కొనుగోలు చేయడానికి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం, కడప, కర్ణాటకలోని బళ్లారి, కొప్పాల్ మహారాష్ట్రలోని షోలాపూర్ జిల్లాలను కేటాయించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో చెన్నూర్, కోటపల్లి మండలా ల ఎంపీపీలు మంత్రి బాపు, మంత్రి సురేఖరామయ్య, చెన్నూర్ జెడ్పీటీసీ మోతె తిరుపతి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ.లజ్గర్, మొయినొద్దీన్, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెల దామోదర్‌రెడ్డి, రైతుబంధు సమితి చెన్నూర్ మండల అధ్యక్షుడు రత్న సమ్మిరెడ్డి, కోటపల్లి పీఏసీఎస్ చైర్మన్ పోలు సాంబాగౌడ్, చెన్నూర్ వైస్ ఎంపీపీ వెన్నపురెడ్డి బాపురెడ్డి, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు శంకర్, మూడు మండలాల పశు వైద్యాధికారులు, గొర్రెల పెంపకం దారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి వేసవి క్రీడాశిబిరాలు

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి ఆధ్వర్యంలో ఉద్యోగుల పిల్లల కోసం వేసవి క్రీడా శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు డీజీఎం(పర్సనల్) అరవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి 27 వరకు ప్రగతి మైదానంలో శిబిరం కొనసాగుతుందన్నారు. 18 ఏళ్లలోపు బాలబాలికలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, బాక్సింగ్, బాస్కెట్ బాల్, నస్పూర్ కాలనీలోని సేవా భవన్‌లో వాలీబాల్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతీరోజు సాయంత్రం 5 గంటలకు మైదానానికి రావాలన్నారు.

శిక్షకులకు ఆహ్వానం

క్రీడల్లో శిక్షణ ఇచ్చే శిక్షకులకు ఆహ్వానం పలుకుతున్నట్లు డీజీఎం తెలిపారు. 25 రోజుల శిక్షణకు రూ.3,400 రెమ్యునరేషన్ ఇస్తామని, ఆసక్తిగల వారు జీఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్టుమెంట్ నందు సంప్రదించాలని సూచించారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

రామకృష్ణాపూర్(చెన్నూర్): రవీంద్రఖని రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం గుర్తు తెలియని రైలు కిందపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఘటనా స్థలంలో దొరికిన సెల్‌ఫోన్ ఆధారంగా మృతుడు మధ్యప్రదేశ్‌కు చెందిన పంకజ్ సరోజ్ (35)గా రైల్వే పోలీసులు గుర్తించారు. మృతుడు జగిత్యాలలోని ఓ గోడౌన్‌లో కొంతకాలంగా కూలీగా పనిచేస్తున్నాడని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సంపత్ తెలిపారు. స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మృతిచెందాడా? లేక మరే ఇతర కారణమా? అనేది తేలాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

రైలులోంచి కిందపడి యువకుడు మృతి

కాగజ్‌నగర్‌టౌన్: ప్రమాదవశాత్తు రైలులోంచి కిందపడి ఓ యువకుడు దుర్మరణం చెందిన ఘటన కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ ప్రాంతంలో చోటు చేసుకుంది. ఆర్‌పీఎఫ్ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ ప్రాంతంలో మంగళవారం ఉదయం 11 గంటలకు గోరఖ్‌పూర్ యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలులోంచి బిహార్ రాష్ట్రంలోని కటిహార్ జిల్లా బాజిద్‌పూర్‌కు చెందిన ఎండీ అబ్దుల్లా (18) ప్రమాదవశాత్తు కిందపడడంతో తీవ్ర గాయాలై సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని సిర్పూర్(టి) సివిల్ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఓసీపీల్లో జాగ్రత్తలు పాటించాలి

మందమర్రిరూరల్: సింగరేణిలోని ఉపరితల గనుల్లో మట్టితీసే సమయంలో రక్షణ సూత్రాలతోపాటు జాగ్రతలు తీసుకోవాలని డీఎంఎస్(మెకానికల్) అరుముగం సూచించారు. ఏరియాలోని ఇల్లెందు క్లబ్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన హెవీ ఎర్త్ మూవింగ్ మిషనరీ స్టేషన్ రివ్యూ సమావేశంలో అధికారులకు సూచనలు చేశారు. ఏరియా ఈఎం మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీడీఎంఎస్ వెంకన్న, ప్రేమ్‌కుమార్, శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి, జనరల్ మేనేజర్(సేఫ్టీ, కార్పొరేట్) గురువయ్య, బెల్లంపల్లి ఏరియా సేఫ్టీ జీఎం జాన్‌ఆనంద్, ఏరియాల సేఫ్టీ జీఎంలు హెచ్ఈఎంఎం కంపెనీ లెవెల్ ఆపరేటర్స్, కాంట్రాక్ట్ వర్క్‌మెన్ పాల్గొన్నారు.

నిర్మల్ ఖిల్లా: ప్రస్తుత కాలంలో అందరిలో ఆరోగ్యంపై అవగాహన ఎక్కువైంది. శరీరానికి ఎటువంటి ఆహారం మంచిదో ఆలోచిస్తున్నారు. చిరుధాన్యాలు లేదా తృణధాన్యాలు, ఆహార ధాన్యాలలో చిన్నగింజలు కలిగిన గడ్డిజాతి పంటలు. సాధారణంగా మిల్లెట్స్ అని పిలువబడే ఈ జాతులలో అనేక రకాలున్నాయి. రాగులు, సజ్జలు, కొర్రలు వంటి చిరుధాన్యాలు గొప్పగా కనిపించకపోవచ్చు. కానీ ఆరోగ్యానికి ఇవిచేసే మేలు మాత్రం చాలా ఎక్కువ. నేడు ధాన్యాల్లో బాగా ప్రాచుర్యంలో ఉన్నవి జొన్నలు, రాగులు, కొన్ని ప్రాంతాల్లో సజ్జలు కూడా వాడుతున్నారు. కానీ కొర్రలు, అరికలు, వరిగెలు, సామలు.. ఇలా ఇంకా చాలానే ఉన్నాయి. వీటి గురించి చాలా మందికి పూర్తిగా తెలియదు. చిరుధాన్యాలుగా పిలుచుకునే మిల్లెట్స్‌తో మంచి ప్రయోజనం ఉందంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఈ నేపథ్యంలో 'సాక్షి' కథనం..

చిరుధాన్యాలతో ఆరోగ్యం



- మిల్లెట్స్‌తోనే ఫిట్‌నెస్
- సంప్రదాయ ఆహారంగా క్రేజ్
- రోజులో ఒక్కపూటైనా తినాలంటున్న ఆరోగ్య నిపుణులు
- ఆలయాల్లో నైవేద్యంగా అందించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

ప్రయోజనం ఏమిటి?

చిరు ధాన్యాల్లో పిండి పదార్థంతో పాటు ప్రొటీన్లు, పీచు పదార్థం, ఇనుము, క్యాల్షియం వంటి సూక్ష్మ పోషకాలు అధికంగా ఉంటాయి. చిరు ధాన్యాల్లో పొట్టు తీసినా, కాస్త కొవ్వు ఉంటుంది. షుగర్ పేషంట్లకు ఒక విధంగా బలం లాంటివి. బియ్యంతో పోలిస్తే ఇవి నెమ్మదిగా జీర్ణం అవుతాయి. కాబట్టి తొందరగా ఆకలి వేయదు. బరువు తగ్గడానికి తోడ్పడుతాయి. రక్తంలో కొలెస్ట్రాల్ శాతం అదుపులో ఉంటుంది. చిరుధాన్యాల్లో క్యాల్షియం, ఐరన్, జింక్, ఫాస్పరస్, మెగ్నీషియం, పొటాషియం, ఫైబర్, విటమిన్–బి, కెరోటిన్, తదితర మూలకాలు ఉంటాయి. వీటిని తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. శరీరంలో ఉండే ఎసిడిటీని అంటే యాసిడ్‌ను తొలగిస్తాయి. వీటిలో ఉండే విటమిన్–బి, 3 శరీరం యొక్క జీవక్రియ ప్రక్రియను సరిగ్గా ఉంచుతాయి. డయాబెటిస్‌ను నివారించగలవు. ఉబ్బసం వ్యాధి నివారణకు మేలు చేస్తాయి. వీటిని తినడం వల్ల శ్వాస సంబంధిత వ్యాధులన్నీ నయమవుతాయి. థైరాయిడ్, మూత్రపిండాలు, కాలేయం, తదితర వ్యాధుల నియంత్రణకు తోడ్పడుతాయి. కడుపులో ఇబ్బంది, అల్సర్ వంటివి తలెత్తకుండా ఉంటాయి. మలబద్ధకం కూడా దూరం అవుతుంది. ఇన్ని ప్రయోజనాలను అందిస్తున్న వీటిని ఆహారంలో ఒక భాగంగా చేసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

ఏయే మిల్లెట్స్ దేనికి పనిచేస్తాయి

సజ్జలు: అధిక బరువు, డయాబెటిస్ సమస్యలు ఉన్నవారు సజ్జలు ఆహారంగా తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. వీటి వల్ల జీర్ణ సమస్యలు నయమవుతాయి. రక్తహీనత సమస్య నుంచి బయట పడవచ్చు.

ఊదలు:
మలబద్ధకం, జీర్ణ సమస్యలు, డయాబెటిస్ ఉన్నవారు ఊదలను ఆహారంగా తీసుకుంటే సమస్యకు మంచి పరిష్కారం లభిస్తుంది.

సామలు:
మైగ్రేన్ సమస్య ఉన్నవారు సామలను వండుకుని తినాలి. ఇవి శరీరానికి మంచి పోషకాలను అందిస్తాయి. ఎముకలు, నరాలు దృఢంగా మారుతాయి. పేగు క్యాన్సర్ రాదు. బాలింతల్లో పాలు ఎక్కువగా తయారయ్యేలా చేస్తాయి.

ఉలవలు:
కిడ్నీలో రాళ్లు ఉన్నవారు ఉలవలు తినాలి. వీటివల్ల శరీర రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. మూత్ర సంబంధ సమస్యలు తగ్గుతాయి.

అరికెలు:
డయాబెటిస్, కొలెస్ట్రాల్ సమస్యలు ఉన్నవారు అరికెలను తింటే శరీర రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది. క్యాన్సర్ రాకుండా ఉంటుంది.

రాగులు:
ఈ గింజలతో జావ, రాగిముద్ద, రాగిరొట్టె చేసుకుని తినవచ్చు. రాగులు రాగులు చలువ చేస్తాయి. ఎండకాలంలో వీటిని తీసుకుంటే శరీరానికి చల్లదనం కలుగుతుంది. అలాగే రక్తం బాగా తయారవుతుంది. శరీరానికి శక్తి లభిస్తుంది.

కొర్రలు:



అధిక బరువుతో ఇబ్బంది పడేవారు కొర్రలను వండుకుని తినాలి. దీనివల్ల బరువు త్వరగా తగ్గవచ్చు. వీటిని తినడం వల్ల జీర్ణ సమస్యలు ఉండవు. గుండె జబ్బులు, కీళ్ల నొప్పులు తగ్గుతాయి.

ఓట్స్:
వీటిలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయి. మార్కెట్‌లో ఈ ఉత్పత్తులు విస్తృత పరిధిలో ఉన్నాయి. ఇవి అనేక రకాల రుచులతో నిల్వ పదార్థాలుగా వస్తున్నాయి.

చిరుధాన్యాల్లో రకాలు
సజ్జలు
కొర్రలు
వరిగెలు
రాగులు
ఓట్స్
అరికెలు
అండు కొర్రలు
ఊదలు
ఉలవలు

ఆలయాల్లో నైవేద్యంగా మిల్లెట్స్

రాష్ట్ర దేవదాయ శాఖ ఆదివారం నిర్వహించిన నూతన సచివాలయ ప్రారంభ కార్యక్రమంలో ప్రధాన ఆలయాలలో మిల్లెట్స్‌తో కూడిన నైవేద్యం, భక్తులకు ప్రసాదాలను అందించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తన చాంబర్‌లో సంతకం చేశారు.

చిరుధాన్యాల సంవత్సరంగా 2023

ఐక్యరాజ్య సమితి 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. మిల్లెట్స్‌లో ఉన్న పోషకాలు శరీరానికి సమతుల్యతను సమకూర్చడంలో క్రియాశీలకంగా ఉంటుందని యూఎన్‌వో తెలిపింది.

సహజసిద్ధ పంటలు



చిరుధాన్యాలు ప్రకృతి సిద్ధంగా లభించే గడ్డి జాతికి చెందినవి. ఇవి మనకు అనాదిగా సంప్రదాయబద్ధంగా వస్తున్నాయి. ప్రస్తుతం ఆరోగ్యపరంగా మిల్లెట్స్ ప్రాధాన్యత పెరిగింది. ఇవి ఎటువంటి క్రిమిసంహారక మందులు లేకుండా పండించే సహజ సిద్ధ పంటల జాతికి చెందినవి. వీటిలో పోషక విలువలు అధికంగా ఉంటాయి. వీటిని వాడడం వల్ల శరీరానికి కావాల్సిన ప్రొటీన్స్ ఖనిజ లవణాలు, పీచు పదార్థం సమృద్ధిగా లభిస్తాయి.

– నల్ల మన్మోహన్‌రెడ్డి, సేంద్రియ రైతు, నిర్మల్

ఆరోగ్యానికి మంచి నేస్తాలు



చిరుధాన్యాలను ఆహారంలో విరివిగా ఉపయోగించడం వల్ల అనారోగ్య సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్ వంటివి రాకుండా కాపాడుతాయి. శారీరకంగా సమతులత్యను కలుగజేస్తాయి. చిన్నపిల్లలకు కూడా రోజులో ఒకసారైనా వీటితో పలురకాల ఆహారపదార్థాలు చేసి తినిపిస్తే ఆరోగ్యపరంగా మంచిది.

– డాక్టర్ అల్లాడి రవి, ప్రకృతిసిద్ధ ఆయుర్వేద వైద్యులు, శ్రీచక్ర హాస్పిటల్, నిర్మల్

అనుమానాస్పదంగా వలస కూలీ మృతి



వాగ్మారే సాహీబ్‌రావు (ఫైల్)

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని రాంపూర్ సబ్‌స్టేషన్ సమీపంలో నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన వలస కూలీ వాగ్మారే సాహీబ్‌రావు (23)అనుమానాస్పద స్థితిలో చెట్టుకు ఉరేసుకుని మృతి చెందినట్లు ఎస్సై భూమేష్ తెలిపారు. భైంసాకు చెందిన షేక్ అక్బర్ కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ సమీపంలో ఉన్న వాసవి జిన్నింగ్ మిల్లులో పనిచేస్తున్నాడు. తాను పనిచేసే మిల్లులో పనిఉందని చెప్పి భైంసాలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న సాహీబ్‌రావును గత నెల 23న తనతో పాటు తీసుకువచ్చాడు. 29న షేక్ అక్బర్ సాహీబ్‌రావు తమ్ముడు దిలీప్ వాగ్మారేకు ఫోన్‌చేసి మీ అన్న మద్యం సేవించి పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తున్నాడని, ఇంటికి తీసుకెళ్లమని సమాచారం అందించాడు. అదే రోజు సాయంత్రం మరోసారి ఫోన్ చేసి ఎటో వెళ్లిపోయాడని చెప్పాడు. మరుసటి రోజు దిలీప్ వాగ్మారే జిన్నింగ్ మిల్లుకు వచ్చి తన అన్న ఆచూకీ కోసం కూలీలతో కలిసి గాలించారు. సోమవారం రాత్రి రాంపూర్ సబ్‌స్టేషన్ వెనుక భాగంలో చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి మృతి చెందినట్లు సమాచారం రావడంతో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతదేహం సాహీబ్‌రావుదేనని గుర్తించారు. మృతుని సోదరుడి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇందారం ఓసీపీని సందర్శించిన అధికారులు



మ్యాపును పరిశీలిస్తున్న అధికారులు

జైపూర్(చెన్నూర్): ఇందారం ఓపెన్ కాస్టు ప్రాజెక్టును మంగళవారం ఆర్‌అండ్‌డీ జీఎం సుభాని, కార్పొరేట్ ప్రొఫెసర్ రాంచందర్, మైనింగ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి, ఎన్ఐటీ సూరత్కల్ సందర్శించారు. ఐకేసీపీ ప్రాజెక్టు అధికారి ఎం.శ్రీనివాస్, ఆపరేషన్స్ మేనేజర్ బ్రహ్మాజీరావు ఉన్నారు.

త్వరలోనే గోలేటి ఓసీపీ ప్రారంభం



మాట్లాడుతున్న జీఎం దేవేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): ఈ ఆర్థిక సంవత్సరంలోనే గోలేటి ఓసీపీని ప్రారంభించే అవకాశం ఉందని బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్ అన్నారు. మంగళవారం గోలేటి టౌన్‌షిప్‌లోని తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గడిచిన ఏప్రిల్ నెలలో ఏరియా సాధించిన ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. బెల్లంపల్లి ఏరియా 2.60 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి గానూ 3.19 టన్నులతో 123 శాతం ఉత్పత్తి సాధించిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం లోనే గోలేటి ఓసీపీని ఏర్పాటు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎంవీకే ఓసీపీతో పోల్చితే గోలేటి ఓసీపీ ఏర్పాటుకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. గోలేటి ఓసీపీలో భాగంగా ముంపునకు గురయ్యే సోనాపూర్ వాసుల కోసం గోలేటి పరిసరాల్లో 12 ఎకరాల పట్టా భూమిని ఎంపిక చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్‌వోటూ జీఎం కేహెచ్‌ఎన్ గుప్తా, డీజీఎం ఐఈడీ ఉజ్వల్ కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే కన్నం వేశారు



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

- రెండు అపార్ట్‌మెంట్లలో చోరీ
- మంచిర్యాలలో రెండు ప్లాట్లలో దొంగతనం
- సీసీసీలో వ్యాపారి ఇల్లు లూటీ

మంచిర్యాలక్రైం/శ్రీరాంపూర్: జిల్లాలో మంగళవారం పట్టపగలే దొంగలు రెచ్చిపోయారు. పదుల కుటుంబాలు నివాసం ఉండే అపార్టుమెంట్లలో తాళం వేసి ఉన్న ఇళ్లకు కన్నం వేశారు. బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదు అపహరించారు. ఒకేరోజు మూడు ప్లాట్లలో చోరీ సంచలనంగా మారింది.

ఆదిత్య ఎన్‌క్లేవ్‌లో..

జిల్లా కేంద్రంలోని ఆదిత్య ఎన్‌క్లేవ్‌లోని కృతిక అపార్ట్‌మెంట్‌లో రెండు ప్లాట్స్‌ను దొంగలు లూటీ చేశారు. మధ్యాహ్నం ఇద్దరు దొంగలు కారులో వచ్చి చోరీకి పాల్పడ్డారు. ఎస్సై సుగుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కృతిక అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న నల్గొండ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మేనేజర్ ఆడెపు సత్యనారాయణ, అదే అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న విద్యుత్ శాఖ ఏఈ కొయిగూరు సాయికుమార్ ప్లాట్లలో చోరీ జరిగింది. సాయికుమార్ ఇంట్లో రూ.50 వేల విలువైన బంగారు ఆభరణాలు, సత్యనారాయణ ఇంట్లో వెండి వస్తువులు, కొంత నగదు చోరీ చేశారు. సత్యనారాయణ ఉద్యోగ రీత్యా నల్గొండలో ఉన్నాడు. సాయికుమార్ కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లడంతో ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లాడు. దీంతో తాళం వేసి ఉన్న రెండు ప్లాట్లను దొంగలు దోచేశారు. డోర్ తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. దొంగలు వచ్చిన కారు, వ్యక్తుల దృశ్యాలు సీసీ పుటేజీలో రికార్డ్ అయ్యాయి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సీసీసీలో..

సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏవీ ఫంక్షన్ హాల్ వద్ద గల శ్రీలక్ష్మీ ఎన్‌క్లేవ్‌లో మంగళవారం పట్టపగలే చోరీ జరిగింది. ఈ కాలనీలోని ఓ అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్న బాకం రమేశ్ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి భార్యాపిల్లలు మూడు రోజులు క్రితమే ఊరికి వెళ్లారు. మంగళవారం ఉదయం రమేశ్ కూడా పని నిమిత్తం ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటి తలుపులు తెరిచి ఉండడం గమనించిన స్థానికులు అతనికి ఫోన్ చేశారు. ఇంటికి వచ్చిన రమేశ్ లోనికి వెళ్లి పరిశీలించగా బీరువా లాకర్ పగులగొట్టి ఉంది. అందులో ఉన్న రూ.15 లక్షల నగదు, 21 తులాల బంగారం, 40 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో డీసీపీ రాంనాథ్‌కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డి సంఘటన స్థలాన్ని సందర్శించారు. క్లూస్ టీం పోలీసులు వేలిముద్రలు సేకరించారు.

బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గించాలి



మాట్లాడుతున్న ఏరియా జీఎం మోహన్‌రెడ్డి

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి ఏరియాలోని బొగ్గు గనుల్లో ఉత్పత్తి వ్యయం తగ్గించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఏరియా జనరల్ మేనేజర్ మోహన్‌రెడ్డి అన్నారు. మందమర్రిలోని జీఎం ఆఫీస్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో గత మాసం ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. కేకే–1గనిలో 7,399 టన్నులు, కేకే–5 గనిలో 14,324 టన్నులు, కాసిపేట గనిలో 8,440 టన్నులు, కాసిపేట–2గనిలో 5,980 టన్నులు, శాంతిఖనిలో 5,169 టన్నులు, ఆర్కే ఓసీలో 1,36,691 టన్నులు, కేకే–ఓసీలో 1,22,159 టన్నులతో కలిపి మొత్తంగా 83 శాతం ఉత్పత్తి సాధించామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ఆర్కే–1ఏ, కేకే–1 గనుల్లో బొగ్గు నిల్వలు నిండుకోవడంతో మూసివేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్ రెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఐఈడీ రాజన్న, సీనియర్ పీవో మైత్రేయబంధు, తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ గనుల్లో 96 శాతం బొగ్గు ఉత్పత్తి

శ్రీరాంపూర్(మంచిర్యాల): డివిజన్‌లోని భూగర్భ గనుల్లో ఏప్రిల్ మాసంలో 96 శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించినట్లు ఏరియా జీఎం బీ సంజీవరెడ్డి తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూగర్భగనుల్లో ఉత్పత్తి లక్ష్యం 1,36,500 టన్నులకు గానూ 1,31,400 టన్నులు సాధించామన్నారు. ఓసీపీ గనుల్లో ఉత్పత్తి లక్ష్యం 4,90,000 టన్నులకు గానూ 2,41,731 టన్నులతో 49 శాతం ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. భూగర్భ గనులు, ఓసీపీలు కలిసి 60 శాతం ఉత్పత్తి నమోదైందన్నారు. రైలు ద్వారా 4,95,129 టన్నులు, రోడ్డు ద్వారా 43,818 టన్నులు రవాణా జరిగిందన్నారు. ఏరియాలో కార్మికుల కుటుంబాలకు పరిశుద్ధమైన తాగునీటిని అందించేందుకు రెండు ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. మూతబడిన చెన్నూరు 1, 1ఏ గనుల స్థానంలో 24 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

- కొత్త కోర్సులకు ముందుకొస్తే అనుమతి
- కేయూ వీసీ ఆచార్య రమేశ్



మాట్లాడుతున్న వీసీ డాక్టర్ రమేశ్

కేయూ క్యాంపస్ : విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని, నైపుణ్యాల అభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి కల్పన లక్ష్యం కావాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లను కోరారు. మంగళవారం క్యాంపస్‌లోని సెనేట్‌హాల్‌లో వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–2024 విద్యాసంవత్సరంలో ఉపాధి కల్పనకు కొత్త కోర్సులను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే కళాశాలలకు అనుమతులు ఇస్తామన్నారు. ఉమ్మడి జిల్లాకు పది చొప్పున 30 కళాశాలలకు అవకాశం ఇస్తామని వెల్లడించారు. ప్రభుత్వ, ప్రైవేటు తేడా లేకుండా అన్ని కళాశాలలు న్యాక్ గుర్తింపునకు ప్రతిపాదించుకోవాలని సూచించారు. ఎంపిక చేసిన ప్రభుత్వ కళాశాలల్లో రీసెర్చ్ సెంటర్లుగా గుర్తించామని, ఇప్పటికే పలువురు అధ్యాపకులకు పీహెచ్‌డీ గైడ్‌షిప్ ఇచ్చామన్నారు. మూడు ఉమ్మడి జిల్లాల్లో కూడా వాల్యుయేషన్ ప్రక్రియ చేపట్టనున్నామన్నారు. పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి మాట్లాడుతూ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కేయూ సీడీసీ డీన్ ఆచార్య వి.రాంచంద్రం మాట్లాడుతూ కళాశాలల్లో నిబంధనలకు అనుగుణంగా అధ్యాపకులు రిజిస్టర్, అడ్మిషన్ల రిజిస్టర్, ఉండాలన్నారు. కేయూ అకాడమిక్ డీన్ ఆచార్య జి.షమిత మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో 290 కళాశాలల్లో వివిధ డిగ్రీ కోర్సుల్లో 14 కంటే తక్కువగా కూడా విద్యార్థులు ఉన్నారన్నారు. సమావేశంలో కేయూ రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు ఆచార్య ముస్తాఫా, డాక్టర్ జె.మధుకర్, ఎస్.జ్యోతి, సీహెచ్ రాధిక, ఎ.నరేందర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు డాక్టర్ కోలా శంకర్, రామా వెంకటేశ్వర్లు, హబీబ్, ఆర్.శ్రీలతాదేవి, డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచి ఆవిష్కరణలు చేయాలి

మంచిర్యాలఅర్బన్: విద్యార్థి దశనుంచి ఆవిష్కరణలు చేయాలని అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో సైన్స్ సెంటర్‌లో సమ్మర్ సైన్స్ క్యాంపు డీఈవో వెంకటేశ్వర్లుతో కలిసి ప్రారంభించారు. వినూత్నంగా ఏర్పాటు చేసిన అదృశ్యమైన అక్షరాలు ప్రత్యక్షం చేస్తూ క్యాంపు ప్రారంభించారు. ఈసందర్భంగా రాహుల్ మాట్లాడుతూ విద్యార్థులందరూ 15 రోజుల క్యాంపులో అనేక ప్రశ్నలు సంధిస్తూ సమస్యలకు పరిష్కారాలు ప్రయోగాత్మకంగా రాబట్టాలని సూచించారు. తద్వారా విజ్ఞానం పొందాలని తెలిపారు. మూఢనమ్మకాలను తొలగించి మోడరన్ సైన్స్‌లో ప్రపంచ భవిష్యత్తును కళ్ల ముందుచేలా సైన్స్ సమ్మర్‌క్యాంపు నిర్వహించాలని సూచించారు. డీఈవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించటానికి సైన్స్ సమ్మర్ క్యాంపు ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల స్పందన అపూర్వమని స్పందన ఇలాగే ఉంటే క్యాంపును మరో 15 రోజులు సెకండ్ స్పెల్ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సైన్స్ అధికారి మధుబాబు, ఉపాధ్యాయులు జాకీర్ హుస్సేన్, శ్రీనివాస్, తిరుపతి, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

6, 7, 8వ తరగతుల విద్యార్థులకే..

సైన్స్ సమ్మర్ క్యాంపులో 6, 7, 8వ నుంచి 8వతరగతి విద్యార్థులకు మాత్రమే అవకాశం కల్పించారు. ఏప్రిల్ 26 నుంచి 28 వరకు 98 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ ఫాంలు అందించారు. మొదటి బ్యాచ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న 60 మందికి మాత్రమే అవకాశం ఉన్నప్పటికీ 98 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవటం గమనార్హం.